క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

కె.గంగవరం: వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడిగా పెట్టా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. కమిటీ ఉపాధ్యక్షులుగా పిల్లి రాంబాబు, సలాది అర్జునరావు, ప్రధాన కార్యదర్శులుగా సాదే వెంగళరావు, నానాపరపు శ్రీనివాస్, చీకట్ల గోపాలం, బత్తుల అప్పారావు నియమితులయ్యారు. దీంతో పాటు కార్యదర్శులుగా, జాయింట్ కార్యదర్శులుగా మరికొంత మంది నియమితులైనట్లు పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ముగిసిన హనుమత్ ఉత్సవాలు

కె.గంగవరం: స్థానిక శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద 62వ సంవత్సర పుష్పాబ్ధి వర్ష పాంచాహ్నిక హనుమత్ వ్రత ఉత్సవాలు నాలుగు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. వేద పండితులు సుదర్శనం లక్ష్మీనారాయణచార్యులు (దొరబాబు), అంగర లక్ష్మీ నరసింహాచార్యులు, అంగర శింగరామాచార్యులు తదితరుల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం భజనలు చేశారు. ముగింపు సందర్భంగా శనివారం ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కె.గంగవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరిగింది. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్ఆర్‌జీఎస్, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఏ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి 1,095 పనులకు గాను రూ. 9,43,73,017 ఖర్చు చేశామని తెలిపారు. ఈ పనులకు గాను వారం రోజులుగా ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారని డ్వామా పీడీ మధుసుదన్ తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా పనులపై తనిఖీ నిర్వహించి రూ. 2,500 రికవరికి ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఓబులనేని శ్రీవరలక్ష్మి, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

కపిలేశ్వరపురం (మండపేట): మత్తు పదార్థాల వినియోగంతో ఎన్నో అనర్థాలు ఉంటాయని మండపేట పట్టణ ఎస్సై అశోక్ అన్నారు. ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ సంస్థ శనివారం 'మరలిరాదు ఈ జీవితం' నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. సంబంధిత పోస్టర్‌ను ఎస్సై అశోక్ ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ జనవరి 7 వరకూ మత్తు పదార్థాలతో జరిగే ప్రమాదాన్ని వివరించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. సంస్థ కార్యదర్శి జాబిర్, సభ్యులు ఒసామా, అజహర్, హారీస్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాల అందజేత

కపిలేశ్వరపురం (మండపేట): ఏడిద పంచాయతీ కార్యాలయంలోని గ్రంథాలయానికి విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగి షేక్ మీరా సాహెబ్ పోటీ పరీక్షల పుస్తకాలను సమకూర్చారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ పోటీ పరీక్షలు రాసే విద్యార్థుల ప్రయోజనార్థం పుస్తకాలను సమకూర్చడాన్ని అభినందించారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు సూచించారు. విశ్రాంత ఉద్యోగి సాహెబ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వీర్రాజు, అజీమున్నీషా, హుస్సేన్, రసూల్, రహీమా పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ అన్నారు. శనివారం మండలంలోని దుగ్గుదుర్రు, నామవానిపాలెంలలో అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈఓపీఆర్డీ సీహెచ్ ఇందిరాదేవి అధ్యక్షతన జరిగిన సభలో శంకరనారాయణ మాట్లాడుతూ దేశంలో ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తొలుత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. దుగ్గుదుర్రు, నామవానిపాలెం గ్రామాల సర్పంచులు పోతుల వెంకటలక్ష్మి, భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి పుట్టా వీరప్రసాద్‌గాంధీ పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల సమ్మె

రామచంద్రపురం: తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ రామచంద్రపురంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారంతో 4వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, గోరిపర్తి నాగభూషణం సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. కార్మికులకు ఆటో యూనియన్ మద్దతు తెలిపింది. సమ్మె శిబిరంలో వైస్ ప్రెసిడెంట్ కె.సత్తిబాబు, పిల్లి వెంకటరావు, గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, గోరిపర్తి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

2023 ప్రగతి చూడు

- సకల జనులకు పథకాలు
- మునుపెన్నడూ చూడని సంక్షేమం
- ఈ ఏడాది పెద్ద ఎత్తున కార్యక్రమాలు



రామచంద్రపురంలో కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ (ఫైల్)



వైఎస్సార్ ఆసరా సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ఈ ఏడాది అంతా బాగుంది.. అనుకున్న పని జరిగింది.. ప్రతి పథకం ఇంటి చెంతకే చేరింది.. ప్రతి రోజూ సంక్షేమాన్ని చూశాం.. ఏ నోట విన్నా అదే మాట. ఎక్కడ చూసినా ప్రగతి బాట. 2023 పూర్తయ్యి కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ గడిచిన రోజులను నెమరవేసుకుంటూ జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో ప్రభుత్వపరంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని అంతా నెమర వేసుకుంటున్నారు.. అలాగే పలు అంశాలను గుర్తుతెచ్చుకుంటున్నారు.. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 2023లో జరిగిన విశేషాల సమాహారమిది.. తెలుసుకుందాం రండి..

సర్వే చేయించి.. హక్కు కల్పించి..

భూ హక్కులు వివాద రహితం కావాలని, కోర్టు కేసులు, లిటిగేషన్లకు అవకాశాలు లేకుండా పేద, మధ్యతరగతి ప్రజల ఆస్తికి రక్షణ కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా అధునాతన విధానంలో భూ సర్వే చేయించి పారదర్శకంగా శాశ్వత భూ హక్కు పత్రాలను పేదలకు అందించింది. దీనికి సంబంధించిన పత్రాలను ఈ ఏడాది జనవరి 4న కె.గంగవరం మండలం కుందూరులో మంత్రి వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేసింది.

ఆటల్లో మెరుపులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. జనవరి 23న వెదురుపాకకు చెందిన నల్లా సింధు చిత్తూరు జిల్లా పోటీల్లో రాణించి జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు వెళ్లింది. ఫిబ్రవరి 15న తెలంగాణ మంచిర్యాలలో జరిగిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో వెదురుపాక హైస్కూల్ విద్యార్థిని రమ్యశ్రీ పాల్గొని ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. ఆగస్టు 24న గొల్లపాలెం హైస్కూల్‌కు స్కూల్ గేమ్స్‌లో రెండోసారి క్రీడా ప్రతిభా అవార్డు దక్కింది. సెప్టెంబర్ 13న రామచంద్రపురం జూనియర్ కళాశాలలో రాష్ట్ర స్థాయి అండర్– 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాస్కెట్ బాల్, బేస్‌బాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. అక్టోబర్ 25న విజయనగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో రామచంద్రపురానికి చెందిన దంగేటి గిరి మణిశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచాడు. నవంబర్ 24న రాయవరం హైస్కూల్‌లో అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. డిసెంబర్ 26న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు క్లస్టర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి.



వద్లమూరులో ఇంటికెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇక లేరని.. మరి రారని..

2023లో పలువురి మరణాలు కలచి వేశాయి. ఫిబ్రవరి 16న జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత కొల్లి నిర్మలాకుమారి గుండెపోటుతో మృతి చెందారు. అదే నెల 27న ఆదివారపుపేట శ్రీశివబాలయోగి మహరాజ్ ఆశ్రమ నిర్వాహకురాలు యశోదమ్మ కాలం చేశారు. అక్టోబర్ 14న మండపేటకు చెందిన మాజీ ఎమ్మెల్యే వల్లూరి రామకృష్ణ చౌదరి, నవంబర్ 22న మండపేటకు చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు, డాక్టర్ పాలడుగు సత్యవతి మృతి చెందారు.

నేరాలు.. ఘోరాలు

ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటున్నా సామాజిక పరిస్థితుల కారణంగా అక్కడక్కడా నేరాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 24న మాచవరం– పసలపూడి గ్రామాల మధ్య దేవుడు కాలనీకి చెందిన సత్యవేణి మృతదేహం గడ్డివామిలో లభ్యమైంది. ఆమెను అత్యాచారం చేసిన తర్వాత హత్యచేసి తగలబెట్టినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. మార్చి 2న మండపేటలో 2.16 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే నెల 18న జెడ్.మేడపాడులో కిడ్నాప్‌కు గురైన మూడేళ్ల బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఏప్రిల్ 14న కె.గంగవరం మండలం కూళ్ల వద్ద గోదావరిలో స్నానానికి దిగి ముగ్గురు మృతి చెందారు. ఏప్రిల్ 18న కాజులూరు మండలం ఆర్యవటం, శీల గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు గొల్లపాలెంలోని బయో డీజిల్ వాటర్ ట్యాంకులో పడి దుర్మరణం పాలయ్యారు. మే 16న గొల్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటుండగా పిల్లల బరువు తూచే తాడు మెడకు చుట్టుకుని ఆరో తరగతి విద్యార్థి మనోజ్ చంద్రశేఖర్ మృతి చెందాడు. అదే నెల 19న ఒడిశాకు చెందిన తడంగి సొబన అనే ఇటుక బట్టీ వలస కూలి కేదారిలంక వద్ద గోదావరిలో జారిపడి చనిపోయాడు. 25న మండపేటకు చెందిన ధాన్యం వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామారెడ్డి హత్యకు గురయ్యారు. జూన్ 3న వెల్లకు చెందిన ముగ్గురు యువకులు నల్గొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

సాయం.. ఆధ్యాత్మిక ప్రాధాన్యం

తాపేశ్వరంలోని ఐదేళ్ల చిన్నారి లక్ష్మీప్రియ కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా రూ.ఐదు లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని ఏప్రిల్ 28న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అందజేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 70, మండపేట నియోజకవర్గంలో 23 ఆలయాలకు నిధులు మంజూరు కాగా, ఆయా ఆలయ నిర్మాణ పనులకు మంత్రి వేణు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జూన్, అక్టోబర్, నవంబర్‌లలో శంకుస్థాపనలు చేశారు.

అందరికీ విద్యాప్రాప్తిరస్తు

ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంది. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పంట పొలాల్లో మారుమూల ఉండగా, దానిని మార్చాలని విద్యార్థులు కోరుతూ వచ్చారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోకి కళాశాలను మార్చడంతో ఫిబ్రవరి 10 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. డిసెంబర్ 22న రామచంద్రపురం జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం అయ్యింది. అక్టోబర్ 3న మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు.

అందుబాటులో సచివాలయాలు

రామచంద్రపురం నియోజకవర్గంలో పలు సచివాలయ నిర్మాణాలు పూర్తి కాగా జూలై 1న ఏరుపల్లి సచివాలయ భవనాన్ని మంత్రి వేణు ప్రారంభించారు. మండపేట నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సచివాలయాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరంభించారు. సెప్టెంబర్ 14న కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే తోట పంపిణీ చేశారు. అదేనెల 30న మండపేటలో డంపింగ్ యార్డు నిర్మాణానికి స్థల సేకరణ అడ్డంకులను పరిష్కరించి, మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసేందుకు మార్గాన్ని సుగమం చేసిన ఎమ్మెల్సీ తోటను కౌన్సిల్ సభ్యులు సత్కరించారు. నవంబర్ 17న అద్దంకివారిలంకలో 70 మందికి 20 సెంట్ల చొప్పున అసైన్డ్ భూమి పట్టాల ఎమ్మెల్సీ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేట కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: మండపేట పట్టణంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సమావేశ అజెండాను కమిషనర్ టి.రామ్‌కుమార్ వెల్లడించారు. పట్టణంలో పలు సమస్యలపై కౌన్సిల్‌లో చర్చ జరిగింది. పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్య సమస్య విషయమై సభ్యులు చర్చించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొందరు సభ్యులు మాట్లాడుతూ కోవిడ్ పెరుగుతున్నందున పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగా సుమారు 30 మంది కార్మికులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులతో మాట్లాడతామన్నారు. అసంపూర్తిగా ఉన్న ముస్లింల షాదీఖానా నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే వేగుళ్లతో సహా సభ్యులు అభినందించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి పూర్తిస్థాయిలో కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. పట్టణ ప్రధాన రహదారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నప్పుడు ఎమ్మెల్యే వేగుళ్ల అభినందించకపోవడం వారి విధానాన్ని తెలియజేస్తుందన్నారు. చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. పలు అంశాలపై కౌన్సిల్ సభ్యులు తీర్మానాలు చేశారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజుబాబు, వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారాయణరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పుంత రహదారులతో తీరనున్న అవస్థలు



అంగరలో పుంత రహదారుల నిర్మాణంపై స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: పుంత రహదారుల నిర్మాణంతో రైతుల అవస్థలు తీరుతాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో పుంత రహదారుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల రైతులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రైతుల సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్న ఎమ్మెల్సీకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరునాతి వెంకటేశ్వరరావు, కవల శ్రీనివాస్, వంగా శ్రీనివాస్, శనివారపు అచ్చన్న, సంకాబత్తుల స్వామికాపు పాల్గొన్నారు.

ప్రమాదాలను ఆహ్వానించొద్దు

- కొత్త సంవత్సర వేడుకల్లో అప్రమత్తత అవసరం
- యువత జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు



నూతన సంవత్సర వేడుకలకు సిద్ధం చేసిన కేక్‌లు

రాయవరం: 2023కు వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఏడాదికి స్వాగతం పలికే వేడుకలకు అంతా సిద్ధమవుతున్నారు. తెలుగు వారికి ఉగాది నుంచే కొత్త ఏడాది అంటూ సంప్రదాయవాదులు చెబుతున్నా, ప్రజలు మాత్రం వెనకడుగు వేయడం లేదు. ప్రధానంగా యువత, విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలకు ఎంతో ఉత్సాహ పడుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో నూతన సంవత్సర వేడుకలకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. 120 గ్రామాల్లో అన్ని వర్గాల వారు పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే పెద్దఎత్తున యువత రోడ్లపైకి వచ్చి కేరింతలు కొడుతూ వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతుంటారు. మద్యం తాగి వాహనాలను నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.

అర్ధరాత్రి నుంచీ..

యువత, విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని రెండు మూడు రోజుల ముందు నుంచే ప్రణాళికలు వేసుకుంటున్నారు. మందు, విందు, వాహనం తదితర అంశాలకు సంబంధించి నగదు, ఇతరత్రా సామగ్రి సమకూర్చుకుంటున్నారు. తమకు అనువైన ప్రదేశాల కోసం అన్వేషిస్తున్నారు. మద్యం తాగి 31వ తేదీ రాత్రి 12 గంటలు దాటిన వెంటనే ద్విచక్ర వాహనాలపై రోడ్లపైకి మితిమీరిన వేగంతో దూసుకెళ్తుంటారు. ఒక్కో వాహనంపై ముగ్గురు లేదా నలుగురు ప్రయాణిస్తూ ర్యాలీలు చేస్తారు. ఉత్సాహం మితిమీరితే ఒక్కోసారి ప్రమాదాలు జరిగి ప్రాణాలకు మీదకు వస్తుంది. గతంలో జరిగిన పలు సంఘటనలే అందుకు నిదర్శనం.

ఓ కంట కనిపెట్టాలి

ఇదే సమయంలో తల్లిదండ్రులు పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. లేదా కుటుంబ సభ్యుల మధ్యలో వేడుకలు జరుపుకొనేలా ఏర్పాటు చేయాలి. వీలైనంత వరకూ ద్విచక్ర వాహనాలు ఇవ్వకుండా ఉండాలి. యువతను ఓ కంట కనిపెట్టాలి. రాత్రి 12 గంటల లోపు పిల్లలు ఇంటికి చేరుకునేలా హెచ్చరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. అమ్మాయిలు, ఉద్యోగినులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వేడుకలకు వెళ్లేటప్పుడు ఎక్కడకు వెళ్తున్నారో ఎప్పటికి వస్తారో కుటుంబ సభ్యులకు చెప్పడం మంచిది.

ప్రత్యేక గస్తీ చేపడతాం



నూతన సంవత్సర వేడుకలకు ఎక్కడా ఎటువంటి అపశృతులు చోటు చేసుకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకూ గస్తీని ముమ్మరం చేస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలి. యువత హద్దుల్లో ఉండాలి. ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు.

– జి.నరేష్, ఎస్సై, రాయవరం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ

రామచంద్రపురం: పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు ఉంటుందని, ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. రహదారులు, పబ్లిక్ స్థలాల్లో వేడుకలు, బాణసంచా కాల్పులను నిషేధమని డీఎస్పీ అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని విజ్ఞప్తి చేశారు. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, బార్‌లు నిర్ణీత సమయంలో మూసివేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కువ శబ్దాలు వచ్చే డీజే సౌండ్ సిస్టం వంటివి ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. తల్లిదండ్రులు నూతన సంవత్సరం సందర్భంగా పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

కాజులూరు: నూతన సంవత్సర వేడుకల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్ అన్నారు. శనివారం పోలీసులు మండలంలోని గ్రామాల్లో పర్యటించి యువతకు పలు సూచనలు చేశారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్డు పక్కల కేక్ కటింగ్‌లు చెయ్యరాదన్నారు. మద్యం తాగి యువత కేరింతలు కొడుతూ బైక్‌లపై తిరగరాదన్నారు.

నైపుణ్యాల మెరుగుతో ఉన్నత శిఖరాలకు..

- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ, 'సాక్షి' ఆధ్వర్యంలో మండపేటలో గమనం–గమ్యం
- విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా కోర్సుల్లో చేరాలని నిపుణుల సూచన



విద్యార్థితో మాట్లాడిస్తున్న కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు



హాజరైన వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: పోటీ ప్రపంచానికి తగినట్టుగా విద్యార్థుల ఆలోచనా ధోరణి మారాలని, ఎప్పటికప్పుడు నైపుణ్యాలు, విజ్ఞానం పెంచుకుంటే ఇంజినీరింగ్‌తో పాటు డిగ్రీ కోర్సులతో మంచి అవకాశాలను చేజిక్కించుకోవచ్చని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కృత్రిమ మేథా, డేటా సైన్స్, రోబోటిక్స్, ఐటీ రంగాలలో విస్తృత అవకాశాలున్నాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలంటే ఇంటర్మీడియెట్ తర్వాత విద్యార్థులు వేసే అడుగులే కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ– 'సాక్షి' సంయుక్త ఆధ్వర్యంలో గమనం– గమ్యం అనే కార్యక్రమాన్ని మండపేటలోని కాపు భవన్‌లో శనివారం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరిగిన ఈ అవగాహన సదస్సుకు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అంతర్జాతీయ సంబంధాలు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు ఇదే మంచి సమయమని సూచించారు. కేఎల్ యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంజినీరింగ్ విద్య తరగతి గదులకే పరిమితం కాదని, నేర్చుకున్న సాంకేతిక అంశాలపై పరిశోధనలు చేయాలని అన్నారు. సమాజానికి ఉపయోగపడేలా ఆవిష్కరణలు ఉండాలన్నారు. కేఎల్ డీమ్డ్ వర్సిటీలో చదువుతో పాటు సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేలా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడి విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లోకొలువులు పొందుతున్నారని తెలిపారు. కొందరు తమ ప్రతిభతో కోర్సు పూర్తికాక ముందే రూ.యాభై లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. నాలుగో ఏడాది ఇంటర్న్‌షిప్‌లో కొందరు నెలకు రూ.లక్షా ఇరవై ఐదు వేలు ఉపకార వేతనం కూడా పొందుతున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థిలో తెలివి తేటలు ఉంటాయని, అయితే సరైన వాతావరణం, వసతులు ఉన్న సంస్థలో చేరితే లక్ష్యం చేరుకోవచ్చన్నారు. రీజనల్ మేనేజర్ పి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఏటా లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేస్తుండగా, వారిలో నలభై శాతం మంది ఉపాధి బాట పడుతున్నారన్నారు. వీరిలో కొందరే మంచి వేతనాలతో మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారని, నాలుగేళ్ల కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం నలభై ఏళ్ల భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. ఇక్కడ పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఏడాది తరువాత విద్యార్థి ఆసక్తి మేరకు కోర్సులు మార్చుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. విదేశీ వర్సిటీలతో ఒప్పందం ఉందని, ప్రతిభావంతులకు వంద శాతం ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. ఒకేసారి రెండు డిగ్రీలు చేసే సౌలభ్యం కూడా అందుబాటులో ఉందన్నారు. బయోటెక్నాలజీ విభాగం నుంచి డాక్టర్ నదీమ్ సిద్దిక్ మాట్లాడుతూ తగిన ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ప్రవేశ పరీక్షలలో ప్రతిభ చూపితే భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు.

డిగ్రీ కోర్సులతోనూ ఉజ్వల భవిష్యత్తు

ఎల్ఎల్‌బీ విభాగం ఆచార్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సులతో పాటు డిగ్రీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. యూనివర్సిటీలో డిగ్రీ కోర్సులు, సదుపాయాల గురించి చక్కగా వివరించారు. ఇంటర్ తరువాత సరైన నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. సమావేశంలో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ బీబీఏ విభాగం నుంచి డాక్టర్ శివకుమార్, ఆర్కిటెక్చర్ విభాగం నుంచి బి.కిరణ్‌కుమార్, విజువల్ కమ్యూనికేషన్ రాజేందర్, అడ్మిషన్ల విభాగం సిబ్బంది, మండపేట పరిధిలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

వీఆర్వో సాయిబాబుకు పరామర్శ



ద్రాక్షారామలో సాయిబాబును పరామర్శిస్తున్న వీఆర్వోల సంఘ నాయకులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో శుక్రవారం ఒక యువకుడి చేతిలో దాడికి గురైన వీఆర్వో సాయిబాబును వీఆర్వోల సంఘ నాయకులు శనివారం కలసి పరామర్శించారు. అనంతరం భీమేశ్వరాలయ ప్రాంగణంలోని పైండావారి అన్నసత్రంలో సమావేశమై వీఆర్వోపై జరిగిన భౌతిక దాడిని ఖండించారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్న ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్వోల సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ మల్లేష్, రామచంద్రపురం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ముల స్వామినాయుడు, దండకడియాల కృష్ణసాయి, మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి పాల్గొన్నారు.

కాజులూరు: ద్రాక్షారామ వీఆర్వో సాయిబాబుపై దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని జిల్లా రజక సంఘ కార్యదర్శి కురవాడ కొండబాబు డిమాండ్ చేశారు. శనివారం దుగ్గుదుర్రులో ఆయన మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే నరాల రవికర్నేలు వీఆర్వో సాయిబాబుపై దాడి చేసి గాయపరిచాడన్నారు.